క్లుప్తంగా

మాలకొండ ఆదాయం రూ.9,72,660

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.9,72,660 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.30,000, తలనీలాలు రూ.31,800, ప్రత్యేక దర్శనం రూ.2,51,800, లడ్డుప్రసాదాలు రూ.1,58,950, అన్నదానం రూ.3,95,800, రూమ్‌అద్దెలు రూ.25,040 వచ్చినట్లు పేర్కొన్నారు.

నేడు అయ్యప్ప మహా అంబళపూజ

పామూరు: పామూరులోని అయ్యన్న ఆలయ ప్రాంగణలో ఆదివారం రాత్రి 7 గంటలకు అయ్యప్ప అంబళపూజ నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గుత్తి వెంకటరాజా తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం అఖండ అష్టాదశ కలశపూజ, సాయంత్రం 5 అశ్వాలపై స్వామి ఉత్సవమూర్తుల గ్రామోత్సవం, రాత్రికి అంబళపూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆధునిక యంత్రాలతో అధిక దిగుబడి



క్షేత్ర స్థాయిలో డ్రోన్ పని తీరుని పరిశీలిస్తున్న అధికారులు

జరుగుమల్లి: ఆధునిక యంత్రాలతో అధిక దిగుబడులు సాధించాలని ఇన్చార్జి ఎంపీడీఓ పి.రామకృష్ణ రైతులకు సూచించారు. పచ్చవ, వర్ధినేనివారిపాలెం సచివాలయ పరిధిలో వికాస్ భారత్ సంకల్ప యాత్ర శనివారం నిర్వహించారు. తాటికొండ రామచంద్రరావు, ఏఈ రమేష్, డాక్టర్ నాగరాజు, ఏపీఎం భాగ్యలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.విజ, తానికొండ బ్రహ్మయ్య, పోకూరి అశోక్ కుమార్, శాంతి పాల్గొన్నారు.

కనుల పండువగా కోటి దీపోత్సవం



జమ్ములపాలెంలో కోటి దీపాలు వెలిగిస్తున్న భక్తులు

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెం శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో గ్రామ భక్తులు కోటి దీపోత్సవం వేడుకను కనుల పండువగా శనివారం నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శివలింగం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి చెన్నుపాటి కృషి ఎనలేనిది

పామూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చెన్నుపాటి లక్ష్మయ్య కృషి ఎనలేనిదని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.సురేష్ అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం యూటీఎఫ్ పామూరు డివిజన్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా పామూరు, సీఎస్‌పురం మండలాలకు చెందిన యూటీఎఫ్ ఉపాధ్యాయులు పలువురు ఉపాధ్యాయ ఉద్యమాలకు ఆద్యుడైన చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. యూటీఎఫ్ పామూరు, సీఎస్‌పురం మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.పాదుషా, జవంగుల వెంకట్రావు, ఎం.సురేష్, బి.మాధవరావు, కావిటి నాగేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



మర్లపాడులో ఘన జీవామృతం తయారీ చేస్తున్న సిబ్బంది

టంగుటూరు: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి విజయలక్ష్మి అన్నారు. మర్లపాడు యూనిట్‌లో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫామింగ్ వారి ఆధ్వర్యంలో శనివారం ఘన జీవామృతం తయారీ, వాటి ప్రయోజనాలు వివరించారు. యూనిట్ ఇన్‌చార్జి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన పంటలు, కూరగాయలు తింటే రుచి, ఆరోగ్యం అని తెలిపారు. ఐసీఆర్పీలు మరియమ్మ, సుజాత పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 45 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జడ్జి భరత్‌చంద్ర



కందుకూరు లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తులు

కనిగిరి రూరల్: జాతీయ లోక్ అదాలత్‌లో 45 కేసులు పరిష్కరించినట్లు కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.భరత్‌చంద్ర అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది క్రితం కుటుంబ కలహాలతో కేసులు పెట్టుకుని విడిపోయిన భార్య, భర్తలు శనివారం జరిగిన లోక్ అదాలత్ ఇరువురు రాజీపడి ఒక్కటైయ్యారు. లోక్ అదాలత్ వల్ల తమ కుటుంబానికి మేలు జరిగిందని ఒక్కటైన దంపతులు కోర్టుకి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపినట్లు కోర్టు సిబ్బంది వెల్లడించారు.

45 కేసులు పరిష్కారం

లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు 41, సివిల్ కేసులు 1, భరణం కేసులు 3 ఇరువర్గాల వారిని రాజీ కుదిర్చి పరిష్కరించినట్లు కోర్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జడ్జి కె.భరత్‌చంద్ర మాట్లాడుతూ రాజీమార్గం రాజమార్గమన్నారు. చిన్న పొరపాటు, క్షణికావేశంతో గొడవలు, మనస్పర్థలు పెట్టుకొని కేసుల వరకు వెళ్లి కోర్టుల చుట్టూ తిరిగి ఆర్థికంగా నష్టపోవద్దని, సమయాన్ని వృథా చేసుకోవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

లోక్‌అధాలత్‌లో 159 కేసుల పరిష్కారం

కందుకూరు: స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 159 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్ విజయబాబు తెలిపారు. వీటిలో 29 సివిల్ కేసులు, 4 వివాహ సంబంధ కేసులు, 53 క్రిమినల్ కేసులు, 60 ఎక్సైజ్ కేసులు, 13 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయని తెలిపారు. లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా కేసులను రాజీ మార్గంలో సులభంగా పరిష్కరించుకోవచ్చునని, దీని వల్ల సమయం, డబ్బులు ఆదా అవుతాయని చెప్పారు. పోలీస్‌స్టేషన్‌లు, కోర్టుల చుట్టూ తిరిగే ఇబ్బందులు కక్షిదారులకు తప్పుతాయన్నారు. కావున ప్రజలు లోక్ అదాలత్ కోర్టులను విరివిగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూర్ణిమాదేవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నిఖిల్‌రెడ్డి, లోక్ అదాలత్ మెంబర్లు బీవీ శేషయ్య, బి.వెంకటేశ్వర్లు, ఎస్కే షంషుద్దీన్, ఎస్ పవన్ కుమార్, చెనికల రమేష్, న్యాయవాదులు సీహెచ్ హరికృష్ణ, బీవీ మురళీకృష్ణ, వై సాంబశివరావు, పెట్లూరి రామకృష్ణ, మురళి, హరికోటేశ్వరరావు, జె.రాజేంద్రబాబు, వి.శ్రీధర్‌నాయుడుపాల్గొన్నారు.

ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే రోడ్డు నిర్మాణం



రోడ్డును పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: ప్రభుత్వ రహదారికి కేటాయించిన స్థలంలోనే నూతన రోడ్డు నిర్మాణం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 11వ వార్డు పరిధిలోని కాశీపురం, తుమ్మగుంట రోడ్డు నిర్మాణ పనులను శనివారం చైర్మన్ గఫార్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ దశాబ్దకాలంగా అధ్వాన్నంగా రహదారి నిర్మాణంలో ప్రజల సొంత భూములు కోల్పోవాల్సి వస్తుందనే అపోహలు పడోద్దని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని కాశీపురం, తుమ్మగుంట రోడ్డుకు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ నిధులు మంజూరు చేయించారన్నారు. రోడ్డు నిర్మాణం త్వరతిగతిన పూర్తయితే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. రోడ్డు నిర్మాణానికి గ్రామస్తులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి మురళీ, ఎస్కే మన్సూర్, స్థానిక నాయకులు మాలకొండారెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- 6 వాహనాల సీజ్, రూ.1.80 లక్షల జరిమానా



వాహనాల లైసెన్స్‌లను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న దర్శి ఎంవీఐ రవికుమార్

పామూరు: మండలంలో నిబంధనలను ఉల్లంఘించి నడుస్తున్న 6 వాహనాలను సీజ్‌చేసి వాటికి సంబంధించి రూ.1.80 లక్షల జరిమానా విధించినట్లు దర్శి ఎంవీఐ పి.రవికుమార్ తెలిపారు. పామూరుతో పాటు మండలంలో శనివారం దర్శి ఎంవీఐ రవికుమార్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికలోడ్, లైసెన్స్ లేకుండా నడుపుతున్న 3 ఆటోలను సీజ్ చేశారు. అదే విధంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు లేకుండా నడుపుతున్న ఓ ప్రైవేట్ స్కూల్‌బస్‌ను, ట్యాక్స్ కట్టకుండా తిరుగుతున్న టెంపో ట్రాక్టర్, లారీని సీజ్ చేసి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాక్స్ కట్టకుండా తిరిగితే 200 శాతం ట్యాక్స్ కట్టాల్సి ఉంటుందన్నారు. వాహన డ్రైవర్లు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనానికి కూడా లైసెన్స్, ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. అధిక లోడ్‌తో ప్రయాణీలను తరలించినా, మద్యం సేవించి వాహన నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు పాటించి వాహనాలను నడిపి అధికారుల చర్యలకు దూరంగా ఉండాలన్నారు. ఆయన వెంట సిబ్బంది కరీం, నాగరాజు ఉన్నారు.

పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి



గుడ్లూరులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మారుతీరావు

గుడ్లూరు: గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారని వైద్యాధికారి మారుతీరావు అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమం కింద శనివారం ఆయన 40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. రక్తహీనత నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఐరన్‌సుక్రోజ్ ఇంజక్షన్‌ను ఇచ్చారు. గర్భిణులు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వారికి పోషక పదార్థాలు అందజేశారు. సీహెచ్‌ఓ భాస్కర్‌రావు, వైద్యసిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.70 వేల విలువైన ఫ్రీజర్ అందజేత



స్వచ్ఛందసంస్థకు బాడీ ఫ్రీజర్‌ను అందజేస్తున్న దాత ప్రతినిధులు

పామూరు: మండలంలో మానవత స్వచ్ఛందసేవాసంస్థ ఆధ్వర్యంలో సంస్థ కమిటీ సభ్యులు పేదలకు పలు విధాలుగా ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా స్థానిక చెత్తనుండి సంపద తయారీ కేంద్రంలో మానవత స్వచ్ఛందసంస్థ నిర్వాహకులకు నెల్లూరు జిల్లా పెద్దిరెడ్డిపలెం గ్రామానికి చెందిన పచ్చవ లక్ష్మయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు పెద వెంగయ్య, చినవెంగయ్య, భూమయ్యలు దాతృత్వంతో రూ.70 వేల విలువచేసే బాడీ ఫ్రీజర్‌ను సమకూర్చి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కన్వీనర్‌లు కల్లూరి రామిరెడ్డి, పోలక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు దాతలు 3 బాడీ ఫ్రీజర్‌లు అందజేశారని, వీటిని 690 మందికి ఉచితంగా వినియోగించినట్లు తెలిపారు. వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, డి.వి.మనోహర్, బాష, బోసు, సిద్ధమూర్తి లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

మాదిగ ఈనాం భూములు అందించాలి



వినతి పత్రం అందిస్తున్న తిరుమలరావు

టంగుటూరు: మాదిగలకు మాదిగ ఈనాం భూములు అందించాలని మాదిగ పోరాట సమితి జిల్లా కార్యదర్శి బక్కా తిరుమలరావు శనివారం వినతి పత్రం అందించి, సమస్య పరిష్కరిస్తారని కోరారు. టంగుటూరు గ్రామంలో సర్వే నంబరు 1247/ ఎ, 1247/సి, 710/1, 710/2లో 11.23 సెంట్లు భూమి అన్యాక్రాంతం జరిగిందని నవంబరు 10న టంగుటూరులో జగనన్నకు చెబుదాం స్పందనలో కలెక్టర్ దినేష్ కుమార్‌కు కార్యదర్శి బక్కా తిరుమలరావు వినతి పత్రం అందించారన్నారు. కలెక్టర్ దినేష్ కుమార్ తహసీల్దార్ సంజీవరావుకు ఆదేశాలు జారీ చేశారని, తహసీల్దార్ సంజీవరావురావు నేటి వరకు కూడా స్పందించకుండా దాట వేత ధోరణి అవలంబిస్తూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

వెలిగండ్ల: మండలంలోని నడింపల్లిలో పేకాట స్థావరంపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను పట్టుకొని అరెస్టు చేసి వారి నుంచి రూ.3890 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై మహేష్‌కుమార్ పేర్కొన్నారు.

అనివేటి మండప నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయం రెండవ దశ నిర్మాణంలో భాగంగా జరుగుతున్న అనివేటి మండప నిర్మాణానికి భక్తులు నుంచి విరాళాలు పెద్ద ఎత్తున అందుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం లింగసముద్రం మండలం పెదపవని గ్రామానికి చెందిన గుండంశెట్టి హనుమంతరావు రూ 5,200ల విరాళాన్ని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యుడు కొడాలి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భైరవకోనలో ప్రత్యేక పూజలు



భైరవకోనలో ఆలయాలవద్ద తహసీల్దార్, ఈవో ఆర్డీని సన్మానిస్తున్న నాయకులు, అర్చకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనను శనివారం తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరా దంపతులు, ఈఓపీఆర్‌డీ కె.సుందరరామయ్య దంపతులు సందర్శించారు. ఈసందర్భంగా త్రిముఖదుర్గ, భర్గలేశ్వర, కాలభైరవ, త్రిముఖదుర్గాదేవి ఆలయాల్లో పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు, వైఎస్సార్ సీపీ నాయకులు ముడుమాల నారాయణరెడ్డి ఘనంగా సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

బేస్తవారిపేట: స్థానిక బస్టాండ్ సమీపంలో మోటార్ సైకిల్‌ను బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం జరిగింది. బేస్తవారిపేటకు చెందిన సీపీఐ మండల కన్వీనర్ బొల్లా బాలిరెడ్డి మోటార్ సైకిల్‌పై హైవేను దాటుతున్నాడు. కొమరోలు వైపు నుంచి బేస్తవారిపేటకు పత్తిలోడు కోసం వెళ్లే బొలెరో వాహనం రాంగ్‌రూట్‌లో వెళ్లి వేగంగా మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. మోటార్ సైకిల్ నడుపుతున్న బాలిరెడ్డి హైవేకు ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్‌కు తల బలంగా తగిలింది. తల పగిలి, కాలు విరిగిపోయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు తరలించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దొనకొండ: మండలంలోని యర్రబాలెం ఆదర్శ గ్రామంగా ఎంపికైంది. ఈ సందర్భంగా సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్ అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి గ్రామీ ణ ఆవాస యోజన కింద సైడు కాలువలకు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. సీసీ రోడ్లు ఏర్పాటు చేసి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ తెలిపారు. సర్పంచ్ నూనె వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు బత్తుల వెంకట సుబ్బయ్య, ముజాయిద్, ఎంపీటీసీ తాల్లూరి లక్ష్మీ నాగేష్ పాల్గొన్నారు.

తప్పు చేసిన వారే బాధ్యులు

పుల్లలచెరువు: ఎవరు తప్పు చేస్తే వాళ్లే బాధ్యులవుతారని, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు చట్టాలు ఉన్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎల్.రాములు అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యర్రగొండపాలెంలో దళిత యువకుడిపై పోలీసుల దాడికి మంత్రి సురేష్ బాధ్యత వహించాలని దళిత హక్కుల పరిరక్షణ సమిత అధ్యక్షుడు నీలం నాగేంద్ర ప్రకటనను ఆయన ఖండించారు. సంఘటన జరిగిన వెంటనే జిల్లా అధికారులతో మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడి బాధ్యులైవరైనా చర్యలు తీసుకోవాలని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

పోస్టల్ బీమాపై ప్రత్యేక డ్రైవ్

పొదిలి: పోస్టల్‌కు సంబంధించి రూ.396ల బీమా పాలసీపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డివిజనల్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ చెప్పారు. స్థానిక పోస్టాఫీసులో బాధిత కుటుంబానికి రూ.10లక్షల చెక్కు అందించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు: కందుకూరు అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త, రెండు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ శర్మిష్ట శనివారం తెలిపారు. అభ్యర్థులు ఈనెల 19వ తేదీ ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై ఉండడంతో పాటు, 21 ఏళ్ల నిండిన వారై 35 ఏళ్ల లోపు ఉండడంతో పాటు వివాహిత అయి ఉండాలి. కచ్చితంగా కేటాయించిన రిజర్వేషన్‌ల అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ పంచాయతీల్లో ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు ఎంపిక ప్రక్రియ ఉంటుందని వివరించారు.

లింగసముద్రం: మండలంలోని తిమ్మారెడ్డిపాలెం సచివాలయం పరిధిలోని గంగపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి హెల్పర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ బి.విజయకుమారి శనివారం తెలిపారు. హెల్పర్ పోస్టును ఓసికి కేటాయించినట్లు చెప్పారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 19వ తేదీ లోగా సమీప సచివాలయంలో ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి పాసై స్థానికంగా ఉండి వివాహితురాలై ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 21 నుంచి 35 ఏళ్ల లోపల వయసు ఉండాలన్నారు.

ఉలవపాడు: ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ విజయకుమారి తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్ పోస్టు లింగసముద్రం మండలం చినపవని కేంద్రం (జనరల్), అంగన్‌వాడీ హెల్పర్ పోస్టు లింగసముద్రం మండలం గంగపాలెంలో అంగన్‌వాడీ కేంద్రంలోని జనరల్ రిజర్వేషన్‌కు, ఉలవపాడులోని ఉలవపాడు-2 జనరల్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 9 నుంచి 19వ తేదీ లోపు దరఖాస్తులు ఉలవపాడు ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలన్నారు.

అంతర పంటలతో లాభాలు



తిమ్మారెడ్డిపల్లిలో తైవాన్ జామతోటలో అంతర పంటగా సాగు చేసిన బంతి పూలు



మూటలు కడుతున్న రైతు దోసపాటి నర్సయ్య

హనుమంతునిపాడు: మండలంలో అంతర పంటలుగా సాగు చేసిన బంతి పూలు రైతన్నలకు మంచి లాభాలు తెచ్చి పెడుతున్నాయి. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, హనుమంతునిపాడు, దాసరిపల్లి, లింగారెడ్డిపల్లి, జమానఖాన్‌పల్లి గ్రామాల్లో పూల తోటలు సాగున్నాయి. కొంత మంది రైతులు నిమ్మతోటలు, జామ తోటల్లో సాళ్ల మధ్యలో అంతర పంటగా బంతి పూలు సాగు చేశారు. ఈ సీజన్‌లో పూలకు మంచి గిరాకీ ఉంది. కిలో పూలు రూ.40 నుంచి రూ.50 వరకు ధర పలుకుతుందని రైతులు చెప్తున్నారు. అయ్యప్ప స్వాములు సీజన్ కావడంతో బంతి పూలకు మంచి గిరాకీ ఉంది. కనిగిరి, పొదిలి, మార్కాపురం, కంభం, ప్రాంతాలకు పూలను తరలిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి పూలు తోటలు కాస్త దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు.

మిర్చి పంట పరిశీలన



మద్దిపూడిలో మిరప పంట పరిశీలిస్తున్న హెచ్‌ఈఓ ధనలక్ష్మి

మద్దిపూడి: మిచాంగ్ తుఫాన్ కారణంగా మండలంలో దెబ్బతిన్న పంటలను ఉద్యానశాఖ ఈఓ ధనలక్ష్మి శనివారం పరిశీలించారు. మద్దిపూడి రెవెన్యూ పరిధిలోని పొట్టిరెడ్డిపాలెం సమీపంలో వర్షానికి రైతు కొమర రమణయ్యకు చెందిన మిరప చేనును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంట సాగుచేసిన ప్రతి ఒక్కరూ ఇ- క్రాప్ బుక్ చేసుకోవాలన్నారు. మండలంలోని కెల్లంపల్లి, మద్దిపూడి గ్రామాల్లో సాగుచేసిన మిరప పంటను పరిశీలించామన్నారు. వర్షపునీరు నిలిచిన పంట చేలో తలలు వాల్చుయని దీనికి లీటరు నీటిలో 10 గ్రాములు యూరియా ద్రావణాన్ని వారంలో 2 సార్లు పిచికారీ చేయాలన్నారు. అంచనా వేసి నష్ట పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు శివారెడ్డి ఉన్నారు.

తుఫాన్ బాధితులకు ఆర్థిక సాయం



అలకూరపాడులో అర్థిక సాయం అందిస్తున్న సురేంద్రరెడ్డి

టంగుటూరు: మండలంలో మిచాంగ్ తుఫాన్‌తో దెబ్బతిన్న 25 ఎస్టీ కుటుంబాలకు తుఫాన్ ఆర్థిక సాయం మంజూరైందని తహసీల్దార్ సంజీవరావు తెలిపారు. శనివారం ఆకుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో అధిక వర్షాలకు తీవ్ర ఇబ్బంది పడి ఆస్తి నష్టం పోయిన మండలం లోని తేటుపురం, ఆలకూరపాడు గ్రామాల్లో 25 మంది ఎస్టీ కుటుంబాల రూ. 2500 అందించారు. ఆలకూరపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు లింగారెడ్డి సురేంద్రరెడ్డి, రామదాసు, వీఆర్వో చింతపల్లి కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కుటుంబ సభ్యుల వనభోజనం

బేస్తవారిపేట: స్థానిక దర్గా రోడ్డులోని పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు బేస్తవారిపేట గ్రామంలోని రెడ్డి కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక జరుగుతుందని యోగి వేమన రెడ్డి సంఘం నిర్వాహకులు తెలిపారు. ఉదయం డీజే పాటలతో మహిళా కోలాటం, కాశీశ్వరస్వామి శివాలయంలో అభిషేకాలు జరుగుతాయన్నారు. కార్తీక వన భోజన కార్యక్రమానికి రెడ్డి కుటుంబ సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

ఘనంగా కుంకుమార్చన

మార్కాపురం టౌన్: పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శనివారం స్వామివారికి మహిళా భక్తులు కుంకుమార్చన పూజలు చేశారు. ఉదయం 5 గంటలకు అభిషేకం, అనంతరం సుప్రభాత సేవ, తోమాల సేవను అర్చకులు అరుణ్‌శర్మ నిర్వహించారు.